క్లుప్తంగా

డప్పు కళాకారుల ధర్నా జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ

హిందూపురం టౌన్: విజయవాడ ధర్నా చౌక్‌లో ఈ నెల 18న జరిగే ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని డప్పు కళాకారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ కోరారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డప్పు కళాకారులకు డప్పు, గజ్జెలు, యూనిఫాంతోపాటు ఇల్లు, ఇంటి స్థలం మంజూరు చేయాలన్నారు. డప్పు కళాకారులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని, వారి సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్లతో తలపెట్టిన ధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. డప్పు కళాకారులు 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు ధర్మవరం రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, నాయకులు మురళి, అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటగుడ్డ పంచాయతీ అధ్యక్షురాలిగా చైతన్య



నూతన అధ్యక్షురాలు చైతన్యను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని కోటగుడ్డ గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా జేడీఎస్ మద్దతురాలు చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో.. ఎలాంటి పోటీ లేకుండా చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జానకీ రాం ప్రకటించారు. ఈ గ్రామ పంచాయతీలో మొత్తం 17 మంది సభ్యులు ఉండగా.. వీరిలో 13 మంది జేడీఎస్ మద్దతుదారులు ఉన్నారు. నలుగురు కాంగ్రెస్ మద్దతుదారులు ఉన్నారు. అయితే కాంగ్రెస్ మద్దతుదారులు ఎన్నికలకు గైర్హాజరయ్యారు. అనంతరం నూతన అధ్యక్షురాలు చైతన్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీడీఓ భవ్య, అకౌంటెంట్ చిత్తణ్ణ, బిల్ కలెక్టర్ జయచంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ యతీశ్ కుమార్ తదితర గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



పంటలను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

పరిగి: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన మండలంలో పర్యటించారు. గొరవనహళ్లిలో రైతులు విజయ్‌కుమార్, నంజుండప్ప ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన ముల్లంగి, టమాట, మామిడి పంటలను పరిశీలించారు. అనంతరం ఘన, ద్రవ జీవామృతం, బీజామృతం తయారీ విధానాన్ని రైతులతో అడిగి తెలుసుకున్నారు. ఏటీఎం పద్ధతిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆరా తీశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులకు మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయభారతి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

మడకశిర: నియోజకవర్గంలో శనివారం ఇంటర్ పరీక్షలు ముగిశాయి. చివరి రోజు ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 30 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. మొత్తం 1,618 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 1,588 మంది హాజరయ్యారు. 7 కేంద్రాల్లో పరీక్షలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

విద్యార్థుల శ్రమదానం



పెనుకొండలో శ్రమదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శనివారం శ్రమదానం నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యం..రోగుల ప్రాప్తం

- శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- 64 ఏళ్ల నాటి భవనంలో వైద్య సేవలు

రొద్దం: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్యం.. దైవాదీనం..ఆరోగ్యం రోగుల ప్రాప్తం అన్నట్లుంది. వైఎస్సార్‌సీపీ హయాంలో పల్లెల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందుకున్న ప్రజలు.. ప్రస్తుత ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుండడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. మండల కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందడంలేదు. దీనికితోడు స్థానిక పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరినా, నూతన భవన నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం 19 గ్రామ పంచాయతీలకు 24 గంటల ఆస్పత్రి ఇది. గతంలో కు.ని.ఆపరేషన్లు కూడా ఇక్కడే చేసేవారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేదు. దీంతో కు.ని. ఆపరేషన్లు చేయడంలేదు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం మండల ప్రజలు హిందూపురం, పెనుకొండ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిధులు మంజూరు చేసి, నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో 20 పడకల మంజూరు..



పునాది స్థాయిలో నిలిచిపోయిన 20 పడకల ఆస్పత్రి భవనం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 20 పడకల ఆస్పత్రి నిర్మాణానికి దాదాపు రూ.85 లక్షలు నిధులు మంజూరు చేసింది. శంకుస్థాపన చేసి, భవన నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. ఆతర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు పూనాదులకే పరిమితం చేశారు. నిర్మాణానికి సమకూర్చుకున్న భవన నిర్మాణ సామగ్రి అమ్మేసుకున్నారు. 20 పడకల ఆస్పత్రి పూర్తి చేసి ఉంటే మండల ప్రజల కల నెరవేరేది.



శిథిలావస్థకు చేరిన రొద్దం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆరోగ్య కేంద్రాన్ని బాగు చేయాలి



శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బాగు చేయాలి. ఆస్పత్రి భవనం పూర్తిగా దెబ్బతినడంతో అందులో వైద్యం చేయాలన్నా సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. 1961లో నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే గదులన్నీ కారుతున్నాయి. ప్రభుత్వం ఆస్పత్రి భవనం నిర్మాణం చేపట్టాలి.

– వెంకటేసులు, రొద్దం

ప్రభుత్వం స్పందించాలి



శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. 64 ఏళ్ల క్రితం నిర్మించిన ఆస్పత్రి భవనం పూర్తిగా స్లాబ్ మొత్తం కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రభుత్వం త్వరగా స్పందించి కొత్తంగా ఆస్పత్రి భవనాన్ని నిర్మాణం చేపట్టాలి.

– శ్రీనివాస్, రైతు సంఘం మండల సెక్రటరీ, చిన్నగువ్వలపల్లి

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయండి



పెనుకొండలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ్ దివస్‌లో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ: స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయాలని రాష్ట బీసీ సంక్షేమ చేనేత జౌళీ శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని దర్గా సర్కిల్‌లో మంత్రి స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని వీధులు పరిశుభ్రం చేయించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి నెలా 3వ శనివారం విధిగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సూచించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, కమిషనర్ సతీష్‌కుమార్, సీఐ రాఘవన్, వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు , పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పారిశుధ్యం మెరుగుపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రామ్‌కుమార్ మట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ గోవిందప్ప, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

రొళ్ల: ఇంటి పరిసరాలతో పాటు రక్షిత మంచినీటి కొళాయిలు, డ్రైనేజీలు, వీధులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రతను పాటించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చెత్తాచెదారం తొలగించారు. గ్రామాల్లో ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసేలా అవగాహన కల్పించాలన్నారు. వేర్వేరుగా ఉంచిన చెత్తను సంపదను తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. వచ్చిన ఆదాయంతో పంచాయతీలను మరింత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అగళి: ప్రజలు, సిబ్బంది భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ విజయవంతం అవుతుందని ఎంపీడీఓ యాదవేంద్ర, సర్పంచ్ లక్ష్మమ్మ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులతో కలసి ర్యాలీ చేపట్టారు. డస్ట్ బిన్స్ వాడకం, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏఓ రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ లక్ష్మమ్మ, ఈఓఆర్డీ పద్మ, సూపర్‌వైజర్ లీలావతి, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్, ఉపాధి హామీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్డీ నాగముని, ఏఓ విశ్వేశ్వరరాధ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణను శుభ్రం చేశారు. పంచాయతీ కార్యాలయం, మెయిన్ బజార్, బస్టాండు ప్రాంతంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలని దుకాణదారులను ఆదేశించారు. అదే విదంగా అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల పరిధిలో శుభ్రతపై అవగాహన అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

గోరంట్ల: పట్టణంలో ఎంపీడీఓ నరేంద్ర ఆధ్వర్యంలో వెలుగు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ నరేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పొడి తడి చెత్తను వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందించాలన్నారు. కార్యక్రమంలో గోరంట్ల గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై విద్యార్థులు, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయ సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. పులమతి సర్పంచ్ అశ్వత్తనారాయణ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిర్మూలిస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

దివ్యాంగులను ఫీల్డ్ విధుల నుంచి మినహాయించాలి

హిందూపురం: సచివాలయ ఉద్యోగుల్లో దివ్యాంగులను ఫీల్డ్ విధుల నుంచి మినహాయించాలని దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ/వార్డు సచివాలయ హేతుబద్దీకరణ ప్రక్రియలో భాగంగా దివ్యాంగ ఉద్యోగులను మల్టీపర్పస్ ఫంక్షనరీస్‌గా వేయడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దివ్యాంగుల చట్టం 2016 అనుసరించి దివ్యాంగ ఉద్యోగులు సమాజంలో ఆర్థికంగా సామాజికంగా ఎదిగే విధంగా ప్రోత్సహించాలని ప్రమోషన్లలో 4శాతం ఇవ్వాలని కోరారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత

అమరాపురం: రబీలో సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించిన రైతులకు శనివారం ఏఈఓ అమర్నాథ్ ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ, మామిడి, టమాట పంటలకు బీమా చెల్లించిన వారికి బీమా ధ్రువపత్రాలను అందజేశామని తెలిపారు. గ్రామ సచివాలయాల్లో పంట బీమా ప్రీమియం చెల్లించిన వారు సచివాలయానికి వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని సూచించారు.

హామీలపై ప్రశ్నిస్తున్నందుకే దాడులు



బాధితులను పరామర్శిస్తున్న హరినాథ్‌రెడ్డి

చిలమత్తూరు: సూపర్‌సిక్స్ హామీల అమలును ప్రశ్నిస్తున్నందుకే కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడుల చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఓబుగారి హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన టీడీపీ నేతల దాడిలో గాయపడి హిందూపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలంపల్లికి చెందిన మాజీ వలంటీర్ అశ్వర్థ, దేవేగౌడను ఆయన పరామర్శించారు. వారికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేస్తూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. చేతనైతే వారు హామీలు అమలుపై సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌ను ప్రశ్నించాలన్నారు. అమాయకులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఇదిలా ఉండగా వలంటీర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున యాదవ్ బాధితులను ఫోన్ ద్వారా పరామర్శించి, దాడి ఘటనను మాజీ సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళతామని తెలియజేశారు.

అగ్ని ప్రమాదంలో మల్బరీ షెడ్డు దగ్ధం



కాలిపోతున్న మల్బరీ షెడ్డు

రొళ్ల: మండలంలోని కాకి గ్రామంలో శనివారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో మల్బరీ షెడ్డు, గడ్డివామి దగ్ధమయ్యాయి. బాధిత రైతు తిమ్మేగౌడు, ఆయన తనయుడు గోవిందరాజు తెలిపిన వివరాలు.. మల్బరీ షెడ్డు పక్కనే కల్లంలో సుమారు 10 ట్రాక్టర్ల గడ్డివామిని కూడా పెంపుడు జీవాల కోసం భద్రపరిచారు. మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో గడ్డివామితో పాటు పక్కనే ఉన్న మల్బరీ షెడ్డు అంటుకున్నాయి. వెంటనే మడకశిర అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. మంటలు ఆర్పడానికి బిందెల సహాయంతో నీళ్లు చెల్లినా ప్రయత్నం లేకుండా పోయింది. ప్రమాదం జరిగి గంట తర్వాత అగ్నిమాపక శాఖ (ఫైర్ ఇంజిన్) సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే సుమారు 80 శాతం మల్బరీ షెడ్డు, గడ్డివామి కాలిపోయాయి. రూ.3 లక్షల వరకూ నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పార్కుల అభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్

పావగడ: స్థానిక మున్సిపల్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో శనివారం ఈ ఏడాది చివరి బడ్జెట్ సమావేశాల ముందస్తు సభ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ పరిధిలో నిర్వహించే వివిధ అభివృద్ధి పనులకు సభ్యులందరి ఆమోదం మేరకు నిధులు కేటాయించారు. పట్టణంలోని పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్ మాట్లాడుతూ.. ఈనెల 26న మున్సిపల్ చివరి బడ్జెట్ సమావేశాలు జరుగుతాయన్నారు. పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా బడ్జెట్ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ల సూచనల మేరకు పట్టణంలో పలు అభివృద్ధి పనుల నిర్మాణాలకు తగినన్ని నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులకు విశ్రాంతి గది, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికసాయం అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు.

ఆర్డీటీ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఆర్డీ మల్లికార్జున

అమరాపురం: గ్రామాల్లో ఆర్డీటీ సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ఆర్డీ మల్లికార్జున పేర్కొన్నారు. శనివారం మండలంలోని హేమావతి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో ఆర్డీటీ సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ.. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పేద ప్రజల కోసం సేవ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేసి కట్టించి ఇస్తామని వెల్లడించారు. కెంకెర, కొర్రేవు గ్రామాల్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అదే విదంగా పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను ఆర్డీ రూపంలో అందించాలని ఆర్డీ మల్లికార్జున సూచించారు. గ్రామాలకు వాటర్ ప్లాంటు మంజూరు చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్, మీనాక్షి, కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆస్తి పన్ను చెల్లించకపోతే నీటి సరఫరా బంద్

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను వసూలు మందగించిందని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తెలిపారు. రూ.కోట్లలో ఆస్తి పన్ను బకాయిలు ఉండగా.. ఈనెల 31లోపు లక్ష్యం మేరకు వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్తి పన్ను చెల్లించాలని ఇంటి యజమానులకు పలు సార్లు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. శనివారం పన్ను చెల్లించని ఇళ్లకు నీటి సరఫరా నిలిపేశారు. పన్ను చెల్లిస్తేనే తిరిగి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని వెల్లడించారు. ఆస్తి పన్ను బకాయిలను చెల్లించాలని కోరారు.

సీఈటీ, నీట్ పరీక్షలకు ఉచిత శిక్షణ

పావగడ: పట్టణంలోని తేజస్ చారిటబుల్, ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి సీఈటీ, నీట్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి, జెడీఎస్ మాజీ సభ్యురాలు గాయత్రిబాయి శంకర మూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక హర్షిత కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న శిక్షణ తరగతులను మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తాలూకా వ్యాప్తంగా ద్వితీయ పీయూ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

గుడిబండ: సీసీ గిరి గ్రామం ఎస్సీ కాలనీలో కొన్ని రోజులుగా తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ డీఎల్ యంజారే గౌడు శనివారం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయించారు. తాగునీరు సరఫరా చేయించడంతో కాలనీ వాసులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు

గుడిబండ: స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకుని వెళుతున్న విద్యార్థులకు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో వీడ్కోలు తెలిపారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

పావగడ: పంట రుణాలను పంటల పెట్టుబడికే ఉపయోగించుకుని లాభాలు సాధించాలని ఎమ్మెల్యే వెంకటేశ్ సూచించారు. శనివారం తాలూకాలోని నాగలమడక వీఎస్ఎస్ఎన్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) కార్యాలయంలో 90 మంది రైతులకు పంట రుణాల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వెంకటరమణప్ప, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ టీఎస్ నరసింహయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఏ శంకర రెడ్డి, తుముల్ డైరెక్టర్ చంద్ర శేఖరరెడ్డి, డీసీసీ బ్యాంక్ సీఈఓ జంగమప్ప, పురుషోత్తమ రెడ్డి, హనుమంతరాయప్ప, మంజునాథ్, నారాయణప్ప పాల్గొన్నారు.

కారులో చెలరేగిన మంటలు

హిందూపురం టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలో శనివారం మధ్యాహ్నం కదులుతున్న కారులోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ముందు భాగం ఇంజిన్‌లోనుంచి పొగలు వస్తుండడంతో కారులో ఉన్న వారు భయభ్రాంతులకు గురై అంబేడ్కర్ కూడలిలో కారు ఆపేశారు. స్థానికులు నీటిని తీసుకొచ్చి మంటలను ఆదుపు చేశారు. కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడడంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే మంటలు చెలరేగడానికి గల కారణాలు తెలియరాలేదు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	37.0
పెనుకొండ	39.0
మడకశిర	37.0

భక్తిశ్రద్ధలతో దివ్య జ్యోతి దర్శనం



దివ్య జ్యోతికి పూజలు చేస్తున్న అర్చకుడు

రొళ్ల: లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం రొళ్ల కొండపై వెలసిన ఉగ్ర నరసింహస్వామి ఆలయంలో వైభవంగా దివ్య జ్యోతి దర్శనం నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, అష్టోత్తర, విష్ణు సహస్రనామాలు తదితర పూజలు చేశారు. తర్వాత పెద్ద ఎత్తున భక్తులు రొళ్ల కొండపై వెలసిన ఉగ్ర నరసింహస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. గరుడేశ్వర స్వామితో పాటు ఉగ్రనరసింహ స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైనే ప్రత్యేకంగా వంటకాలు తయారు చేసి స్వామి వారి విగ్రహం ఎదుట ప్రసాదాన్ని నైవేద్యంగా ఉంచారు. ఆలయం ఎదుట పెద్ద ఎత్తున దివ్య జ్యోతిని వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

హిందూపురం: పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం జయంతిని ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బీఎస్పీ జిల్లా కోశాధికారి హరికుమార్, నాయకులు పెన్నయ్య, శ్రీనివాస, సుబ్బరాయప్ప, పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు మౌలాలి, నాయకులు సడ్లపల్లి నారాయణప్ప, గంగాధరప్ప, బాబు, ఖలందర్, చాంద్‌బాషా ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

రొద్దం: పెద్దగువ్వపల్లి నుంచి కల్లుకుంట క్రాస్ వరకూ తారు రోడ్డు నిర్మాణానికి మంత్రి సవితమ్మ శనివారం భూమిపూజ చేశారు. రూ.75 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. రోడ్ల అభివద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ

రొద్దం: మండల కేంద్రంలోని పావగడ–పెనుకొండ ప్రధాన రహదారి పక్కన మారెమ్మదేవి ఆలయం సమీపాన గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటుకు ఎంపీ బీకే పార్థసారథి శనివారం భూమి పూజ చేశారు. మండలంలో నిరుద్యోగ హిళలకు ఉపాధి కల్పించడానికి గార్మెంట్స్ ఏర్పాటు చేయడంపై అభినందించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

హిందూపురం టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు కుట్టు మిషన్‌పై శిక్షణ పొంది ఉపాధి పొందాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు. అంతకుముందు ఆయన ఎంజీఎం క్రీడామైదానంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఇదిలా ఉండగా వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భార్య ప్రీతి మృతి చెందిందని, వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె భర్త కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని జర్నలిస్టులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.